క్లుప్తంగా

దుస్తుల పంపిణీ



నెల్లూరు(బృందావనం): జెడ్పీ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో పొదలకూరు రోడ్డు గౌతమినగర్‌లోని హరిత ఆశ్రమంలో వృద్ధులకు సోమవారం నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ గౌరవాధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వేదాంతం హర్షవర్ధిని, వీఎస్ ప్రసాద్, సావిత్రి, కమలాకరం సౌజన్యంతో కార్యక్రమం చేపట్టామన్నారు. మెట్టు సుజన, ఖాజామస్తాన్, వెంకటరమణయ్య, లక్ష్మి, నాగేశ్వరరావు, వెంకటసుబ్బయ్య, మునిరత్నం, నిర్వాహకులు రాజేశ్వరి, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుత విధానంలోనే కార్మికుల విధులు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలో కార్మికులు ప్రస్తుత విధానంలోనే వారి విధులు కొనసాగిస్తారని, ఆప్కాస్ ద్వారానే క్రమం తప్పకుండా జీతాలు అందుకొంటారని కమిషనర్ నందన్ తెలిపారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్మికుల ఉద్యోగ భద్రతకు పూర్తి భరోసా ఉంటుందని తెలిపారు.

కుంభాభిషేక మహోత్సవాలకు శ్రీకారం



నెల్లూరు(బృందావనం): రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మహాకుంభాభిషేక మహోత్సవాలకు సోమవారం భక్తిశ్రద్ధలతో శ్రీకారం చుట్టారు. తొలిరోజు సోమవారం సాయంత్రం కంచికామకోటి పీఠం ఆస్థాన సిద్ధాంతి ఎల్.విజయసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్వస్తి వచనం, మహాగణపతి పూజ, పుణ్యాహవచనం తదితర పూజలు నిర్వహించారు. అర్చకుడు ఎస్.రఘురామమూర్తి, ఈఓ జనార్ధన్‌రెడ్డి పాల్గొని, పర్యవేక్షించారు.

సన్మానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మిని కాంగ్రెస్ పార్టీ నేత తలిరి బాలసుధాకర్ సోమవారం ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను సన్మానించారు.

మంత్రి కొల్లు రవీంద్ర పర్యటన నేడు

నెల్లూరు(అర్బన్): రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం జిల్లా పర్యటనకు రానున్నారు. కావలి నియోజకవర్గంలో సీసీరోడ్లు, జల్‌జీవన్ మిషన్ వాటర్ వర్క్ పనులు తదితర అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారు.

మాజీ మంత్రి అనిల్‌కు నోటీస్

కోవూరు: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఫిర్యాదుపై నమోదైన కేసులో మాజీ మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు కోవూరు పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరుకావాలని ఎస్సై రంగనాథ్‌గౌడ్ నోటీస్ జారీ చేశారు. దీనిని నెల్లూరులోని ఆయన నివాసంలో కుటుంబసభ్యులకు సోమవారం రాత్రి అందజేశారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు

కొడవలూరు: ఆర్టీసీ బస్సును వేగంగా వచ్చిన కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులోని వారితో పాటు ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. తాడేపల్లి నుంచి తిరుపతి వెళ్తున్న కారు సోమవారం నార్తురాజుపాళెం టపాతోపు వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినడంతో పాటు ఆర్టీసీ బస్సు వెనుక భాగం దెబ్బతింది. కారులోని ప్రయాణికులు, బస్సులోని ప్రయాణికులు ఎలాంటి గాయాల్లేకుండా సురక్షితంగా బయట పడడంతో పెను ప్రమాదం తప్పింది.

లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): నగర పంచాయతీ పరిధిలోని లేఅవుట్‌లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ అవకాశం కల్పించిందని నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేఅవుట్‌లు, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకుని ఉన్న వారు 10 లేదా 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలతో పాటు పీనలైజేషన్ చార్జీలను చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. ఈ అవకాశం మూడు నెలలు మాత్రమే ఉంటున్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

• కలెక్టర్ ఆనంద్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరురూరల్: వివిధ శాఖల మండలాధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ హాల్లో పీజీఆర్ఎస్ అర్జీలు, ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఉపాధిహామీ పనులు, పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు మొదలైన్న అంశాలపై సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఆయాశాఖల అధికారులతో కలెక్టర్ సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర పథకాలను అర్హులకు అందజేయడానికి వీలుగా జాయింట్ ఎల్పీఎంలను త్వరగా సబ్ డివిజన్ చేయాలని ఆదేశించారు. అలాగే అవసరమైన చోట ఆధార్ డీ లింకింగ్‌ను కూడా పూర్తి చేయాలన్నారు. పీజీఆర్ఎస్ అర్జీలకు గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాలు, ఉపాధి హామీ పనుల పురోగతి మెరుగుపడాల్సి ఉందన్నారు. హౌసింగ్‌లో ఉపాధి హామీని అనుసంధానిస్తూ 90 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించి పిల్లలందరూ బడిలో చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందించాలని, తాగునీటి వసతి సౌకర్యాలను మెరుగుపరచాలన్నారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో హుస్సేన్ సాహెబ్, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, విద్యుత్ ఎస్‌ఈ విజయన్, డీఈఓ బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

పీ–4ను ముందుకు తీసుకెళ్లాలి

జిల్లాలో పీ–4 కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అన్నిశాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శుల ఎంపికపై అధికారులతో కలెక్టర్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా పీ–4 కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 10 వేలకుపైగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శులు ముందుకొచ్చారన్నారు. ఈ సంఖ్య మరింత పెరగాలన్నారు. జెడ్పీ సీఈఓ మోహన్‌రాజు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డ్వామా పీడీ గంగాభవాని, ఉద్యాన శాఖాధికారి సుబ్బారెడ్డి, డీఎంహెచ్ఓ సుజాత, ఐసీడీఎస్, మెప్మా పీడీలు హేనాసుజన్, లీలారాణి పాల్గొన్నారు.

కార్మికులపై అసత్య ప్రచారాలు దారుణం



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నెల్లూరు(బారకాసు): నగరంలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెపై కార్పొరేషన్ అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలు దారుణమని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు అన్నారు. మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా 14వ రోజు సోమవారం బోసుబొమ్మ ఏబీఎం కాంపౌండ్ నుంచి పప్పులవీధి సెంటర్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల జీతాల పెంపు కోసం, గొంతెమ్మ కోర్కెల కోసం సమ్మె చేయడం లేదన్నారు. ఒకే ఒక్క డిమాండ్‌తో నగరంలో సమ్మె కొనసాగుతోందన్నారు. అనేక సంవత్సరాల నుంచి చాలీచాలని జీతాలతో ఎప్పటికైనా రెగ్యులర్ అవుతామన్న ఒకచిన్న ఆశతో కార్మికులు పనిచేస్తున్నారన్నారు. అయితే అనేక సంవత్సరాల నుంచి నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులను కాంట్రాక్టర్ కింద బానిసలుగా చేసేందుకు టెండర్లు పిలిచి పనులు కాంట్రాక్టర్లకు అప్పగించడాన్ని నిరసిస్తూ పోరాటం జరుగుతోందన్నారు. కాంట్రాక్టర్లు పనులు తీసుకోవడం వల్ల కేవలం కార్మికులకే కాకుండా ప్రజలందరికీ భవిష్యత్తులో యూజర్ చార్జీల పేరుతో అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కార్మికులు చేస్తున్న పోరాటానికి ప్రజలందరూ సంపూర్ణ మద్దతు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.నాగేశ్వరరావు, కె.పెంచలనరసయ్య, కొండా ప్రసాద్, పి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంకే లేఅవుట్‌పై చర్యలకు వినతి



జేసీ కార్తీక్‌కు వినతి పత్రం ఇస్తున్న చైతన్య

నెల్లూరు(అర్బన్): లేఅవుట్‌లో చూపిన పార్కు స్థలాలను కూడా ప్లాట్లుగా చూపి అమ్మిన మణికంఠ లేఅవుట్ (ఎంకే) యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హరనాథపురానికి చెందిన కటకం చైతన్యతో పాటు మరికొంత మంది స్థానికులు కలెక్టరేట్‌లో జేసీ కార్తీక్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ నగర పరిధిలోని 17వ డివిజన్ ధనలక్ష్మీపురం–వావిలేటిపాడు ప్రాంతంలో వేసిన ఎంకే లేఅవుట్‌లో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

పీఎంపీ జిల్లా అధ్యక్షుడికి అవార్డు



నెల్లూరు(అర్బన్): స్థానిక మద్రాస్‌బస్టాండ్ సమీపంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ కార్యాలయంలో దయా డాట్ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌కు విశిష్ట సామాజిక సేవ–2025 అవార్డును ఆదివారం రాత్రి అందించారు. విక్రమసింహపురి యూనివర్సిటీ వీసీ శ్రీనివాసరావు, కమిషనర్ నందన్, నారాయణ మెడికల్ గ్రూప్స్ ఏజీఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి చేతుల మీదుగా వేణుగోపాల్‌ను సన్మానం చేసి అవార్డును అందజేశారు. అడిషనల్ ఎస్పీ సౌజన్య పాల్గొన్నారు.

పాలన మరచిన కూటమి సర్కార్



మాట్లాడుతున్న మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్

నెల్లూరురూరల్: రాష్ట్రంలో కూటమి సర్కార్ పాలనను మరచిపోయి కక్ష సాధింపు చర్యలకు మాత్రమే పాల్పడుతోందని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ దుయ్యబట్టారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అసత్యాలను చెబుతూ అవినీతికి పాల్పడుతోందన్నారు. దుగరాజపట్నం పోర్టును కష్టపడి తీసుకొస్తే చంద్రబాబు లేఖ రాసి ఆపించేశారన్నారు. పోర్టు నిర్మాణం జరిగి ఉంటే ఇప్పటికే వేలల్లో ఉద్యోగాలు వచ్చి ఉండేవని, ఇలా దేశాలు పట్టుకుని తిరగాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. రాజధాని పేరుతో 70 వేల ఎకరాలు తీసుకొని నీళ్లలో పెట్టారన్నారు. లిక్కర్ స్కామ్‌లో ఆధారాలు ఉంటే బయట పెట్టాలన్నారు. రాష్ట్రంలోని పేదలకు సరైన విద్య, ఆరోగ్యం అందడం లేదన్నారు. 35 వేలకు పైగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసి పది వేలకు తగ్గించేలా కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని, తద్వారా ప్రైవేటు పాఠశాలలకు లాభాలు చేకూర్చేలా ప్రవర్తిస్తోందని తెలిపారు. సైదాపురం మైన్స్‌లో విపరీతంగా అక్రమ తవ్వకాలు చేపడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలీసులు పట్టించుకోవడం లేదు.. న్యాయం చేయండి

నెల్లూరు(క్రైమ్): మాపై దాడి చేశారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోవడం లేదు. మీరైనా స్పందించి మాపై దాడి చేసిన వారిపై కేసు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సీతారామపురానికి చెందిన టి.మాధవరావు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పోలీసు అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామపురం బస్టాండ్ వద్ద మాకు షాపింగ్ కాంప్లెక్స్ ఉందని, అందులోని ఓ షాపును కాశీరావు అనే వ్యక్తికి బాడుగకు ఇచ్చామన్నారు. రెండేళ్ల తర్వాత కాశీరావు షాపును ఖాళీ చేశారని, ఆ సమయంలో షాపులోని ఫర్నీచర్ తీసుకెళ్లలేదన్నారు. దీంతో ఆ ఫర్నీచర్‌ను మా ఇంట్లో భద్రపరిచామన్నారు. ఈనెల 27న కాశీరావు తమ్ముడు కాశీరత్తయ్య అలియాస్ గాంధీ తన స్నేహితులతో వచ్చి ఫర్నీచర్‌ను అడగ్గా మేము ఇచ్చివేశామని, అయినప్పటికీ వారు మా తమ్ముడు, నాపై దాడి చేసి గాయపరిచారన్నారు. ఈ విషయమై మేము స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు పట్టించుకోలేదని, గాంధీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాపైనే కేసు నమోదు చేశారన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గ పరిధిలోని 22వ డివిజన్‌లో రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో 22వ డివిజన్ అభివృద్ధికి రూ.3.25 కోట్ల నిధులు కేటాయించినట్లు వివరించారు.

ఇంజినీరింగ్ కళాశాల మంజూరు అభినందనీయం

నెల్లూరు(అర్బన్): జిల్లాకు ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయడం అభినందనీయమని ప్రజాసత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఆనంద్‌కు అభినందన పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు ఉపయోగపడే ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల కావాలని కోరుతూ తమ సంఘం ఆధ్వర్యంలో పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. ఈ ఏడాది జనవరి 6న కూడా కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వగా దానిని ప్రభుత్వానికి పంపించారన్నారు. ఎట్టకేలకు ఇంజినీరింగ్ కళాశాల మంజూరైన నేపథ్యంలో జిల్లా ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రజాసత్తా నాయకులు దయాకర్, బాలవర్ధి, జాలయ్య, రామయ్య, పద్మ పాల్గొన్నారు.

సీసీటీవీలకు నిరంతర విద్యుత్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో సీసీటీవీ వ్యవస్థలకు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించేందుకు జిల్లా నోడల్ అధికారిగా విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (టెక్నికల్) శేషాద్రి బాలచంద్రను ఎస్పీడీసీఎల్ నియమించింది. ఏమైనా సమస్యలుంటే 94408 11990 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సోమవారం కోరారు.

కార్మికులపై లాఠీచార్జి దుర్మార్గం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గత 14 రోజుల నుంచి సామరస్యంగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులపై ఐదో నగర పోలీసులు లాఠీచార్జి చేయడం దుర్మార్గమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్, రఫీ, రషీద్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యను పరిష్కరించాల్సిన పోలీసులు అధికార పార్టీకి చెందిన ఒక చోటా నాయకుడి మాటలు విని కార్మికులపై లాఠీచార్జి చేయడం సరికాదన్నారు. సంబంధిత సీఐను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

డాక్టర్ నరేంద్ర మృతి



డాక్టర్ నరేంద్ర(ఫైల్)

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్ డిపార్ట్‌మెంట్(హెచ్ఓడీ)గా పని చేస్తూ రెండు వారాల క్రితం తిరుపతి రుయా ఆస్పత్రికి బదిలీ అయిన ప్రొఫెసర్ డాక్టర్ నరేంద్ర(53) సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన తిరుపతిలోని రుయా ఆస్పత్రి భవనం ముందు నడుచుకుంటూ వెళ్తుండగా హార్ట్ స్ట్రోక్ వచ్చింది. వెంటనే అత్యవసరంగా స్విమ్స్ ఆస్పత్రికి తరలించేలోపు మృతిచెందారు. ఆయన ప్రస్తుతం నెల్లూరులోనే నివాసం ఉంటున్నారు. చాలా కాలం నుంచి నెల్లూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్ హెచ్ఓడీగా, కోవిడ్ నోడల్ ఆఫీసర్‌గా, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా, ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్‌గా, పీజీ కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ క్రమంలో ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

స్వచ్ఛతకు ప్రజల సహకారం అవసరం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): నగర ప్రజలు వ్యర్థాలను నిర్దేశించిన డస్ట్ బిన్లలో మాత్రమే వేసి స్వచ్ఛ నెల్లూరు సాకారానికి సహకరించాలని కమిషనర్ నందన్ విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎస్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రజలందరూ గృహ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా, వీధుల్లో ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లలో మాత్రమే వేయాలని సూచించారు. టిడ్కో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయనున్నామని తెలిపారు. స్థానిక సమస్యలను 94940 18118 నంబర్‌కు వాట్సాప్ ద్వారా లేదా 1800 425 1113 టోల్ ఫ్రీ నంబర్‌కు ఉదయం 6 నుంచి సాయంత్రం 6లోపు తెలియజేయాలని కోరారు. ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలన్నారు. విభాగాల వారీగా అకౌంట్ సెక్షన్ 2, ఆప్కాస్ 2, ఇంజినీరింగ్ 9, టిడ్కో హౌసింగ్ 15, రెవెన్యూ 2, టౌన్ ప్లానింగ్ 5, పబ్లిక్ హెల్త్ 4, హెచ్ సెక్షన్ –3, పెన్షన్– 1, మొత్తం 43 అర్జీలను కమిషనర్ అందుకున్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, సెక్రటరీ శ్రీలక్ష్మి, సిటీ ప్లానర్ హిమబిందు, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించండి

నగర పరిధిలో రోడ్లను ఆక్రమిస్తూ నిర్మిస్తున్న కట్టడాలను గుర్తించి, నోటీసులు జారీ చేసి తొలగించాలని కమిషనర్ నందన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ స్థానిక వనంతోపు, శోదన్‌నగర్ పరిసర ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. రోడ్లను ఆక్రమిస్తూ చేపట్టిన నిర్మాణాలను కమిషనర్ గమనించి, నోటీసులు జారీ చేయాలన్నారు. అనంతరం స్థానిక కుక్కల గుంటలోని నగరపాలక సంస్థ వెహికల్ షెడ్డును సందర్శించారు. ప్రతి వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కుష్టు రహిత సమాజమే ధ్యేయం



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): కుష్టు రహిత సమాజమే ధ్యేయంగా వైద్యసిబ్బంది కృషి చేయాలని అడిషనల్ డీఎంహెచ్ఓ, జిల్లా కుష్టు నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. నగరంలోని వైద్యశాఖ కార్యాలయంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేంద్రబాబుతో కలిసి ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కొత్తగా నమోదైన కేసులు, వారికి అందిస్తున్న వైద్యం గురించి ఆరాతీశారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే తగిన చికిత్స ద్వారా అంగవైకల్యం లేకుండా చేయవచ్చని తెలిపారు. వచ్చేనెల 11న అంగవైకల్యం గల బాధితులకు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పీఓడీ క్యాంపు నిర్వహించాలని కోరారు. అవసరమైన వారికి సీఎంఆర్ చెప్పులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేంద్రబాబు, టీహెచ్ వార్డు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీత, ఫిజియోథెరపిస్ట్ నరసింహులు, డీఎఫ్ఐటీ ఏఓ సతీష్, మల్లమ్మ, డీపీఎంఓలు పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధులకు చెక్



ఆరోగ్య కేంద్రంలో తనిఖీ చేస్తున్న మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ

నెల్లూరు(అర్బన్): దోమల నివారణతో డెంగీ, చికెన్‌గన్యా, మలేరియా, ఫైలేరియా లాంటి పలు రకాల వ్యాధులను దూరం చేయవచ్చని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ తెలిపారు. స్థానిక గాంధీనగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి రోగులకు చేసిన రక్త పరీక్షల వివరాలను పరిశీలించారు. అనంతరం సమీపంలోని కార్పొరేషన్ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమలను నివారించేందుకు ఇంటి ఆవరణలో, చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయడం ద్వారా దోమల లార్వాలను నియంత్రించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం వేదమూర్తి, కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన వడ్డెర మహాసభలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఏనుగు సుందరరామిరెడ్డి ఆడిటోరియంలో ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం తొలి రాష్ట్ర మహాసభలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీల మాదిరిగా వడ్డెరలకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, వడ్డెరలకు నివేశన స్థలాలు, పక్కా ఇళ్లు నిర్మించాలని, గ్రామాల్లోని వడ్డెరలకు రెండెకరాల సాగు భూమి ఇవ్వాలని, కంకర క్వారీలు, ఎర్రమట్టి కొండలపై 50 శాతం హక్కు కల్పించాలని, వడ్డెర కార్పొరేషన్ను ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని సంఘ నేతలు తీర్మానం చేశారు. అనంతరం సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా చల్లా వెంకటయ్య, గుంజి దయాకర్, కోశాధికారిగా శివనాగమల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బాలవెంకటేశ్వర్లు, మోహన్, సహాయ కార్యదర్శిగా శ్రీరాములు, పద్మనాభరాజుతో పాటు పలువురు కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తిరుమల యాత్ర ప్రారంభం



నెల్లూరు(బృందావనం): సత్యమార్గ్ ఫౌండేషన్ (ఎస్ఎంఎఫ్) కన్వీనర్ పూడి రవిస్వామి ఆధ్వర్యంలో తిరుమల శ్రీవారి 28వ ఉచిత దీవెన యాత్రను సోమవారం పురమందిరం ప్రాంగణంలో ఘనంగా చేపట్టారు. గీతావైభవ్ ట్రస్ట్ చైర్మన్ నజీర్‌బాషా గురూజీ ఈ యాత్రను ప్రారంభించారు. నిర్వాహకుడు రవిస్వామి మాట్లాడుతూ జిల్లాలోని గుండ్లపాళెం, నిడుముసలి, ఇందుకూరుపేట, పోతురాజుదిబ్బ, జంగందొరువు, గమళ్లపాళెం, తోటపల్లిగూడూరు, వరిగొండ తదితర ప్రాంతాల నుంచి 360 మంది భక్తులతో యాత్ర చేపడుతున్నట్లు వివరించారు. నిర్వాహకులు పూడి మస్తానమ్మ, మల్లికార్జున, సురేష్, కోవూరు సత్యమ్మ పాల్గొన్నారు.

‘ట్రంకురోడ్డును అమ్మకానికి పెట్టిన కమిషనర్’



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పార్కింగ్ వసతుల్లేని షాపింగ్ మాల్స్‌కు అనుమతులిస్తూ ట్రంకురోడ్డును నగర కమిషనర్ అమ్మకానికి పెడుతున్నాడని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా ఆరోపించారు. నగరంలోని సంతపేటలో ఉన్న సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కనకమహాల్ సెంటర్ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు పార్కింగ్ స్థలాలు లేని షాపింగ్‌మాల్స్‌కు కమిషనర్ అనుమతులు ఇస్తున్నారని, దీంతో వాహనాలు రోడ్డుపై పార్కింగ్ చేయడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోలీసులు కూడా ట్రాఫిక్‌ను నియంత్రించడంలో ఘోరంగా విఫలమవుతున్నారని తెలిపారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు చిన్నదుకాణాలపై జరిమానాలు వేస్తూ పెద్దపెద్ద భవనాలు, దుకాణాలు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నుంచి భారీగా లంచాలు తీసుకుని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకుని ట్రాఫిక్ నుంచి నగర ప్రజలకు విముక్తి కలిగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సర్దార్, షాజహాన్, కరిముల్లా, వాసుదేవరెడ్డి, మీరా, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.